

నేటి నుంచి ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్

● ఉమ్మడి జిల్లాలో మూడు సహాయ కేంద్రాలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న అధ్యాపకులు

7



● నరసరావుపేటలో శనివారం కార్మికుల ప్రదర్శన

పుర కార్మికులు.. పోరుబాట

● మున్సిపల్ కమిషనర్లకు సమ్మె నోటీసు ● నేటి నుంచి సమ్మెలోకి కాంట్రాక్ట్ కార్మికులు ● 16 నుంచి పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నేతలకు, అధికారులకు వినతిపత్రాలు.. వివిధ రూపాల్లో ఇప్పటి వరకు ప్రదర్శనలు, ధర్నాలతో నిరసన తెలిపిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధికంగా పోరుబాటకు సిద్ధమయ్యారు. పురపాలక సంఘాల్లోని వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపాల్టీల్లో కమిషనర్లకు నోటీసులు కూడా అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. జిల్లాలోని ఎనిమిది మున్సిపాల్టీల్లోని వందలాది కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లో ప్రధానంగా తాగునీటి సరఫరాకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవనున్నాయి. ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం, పరిపాలన, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తొలుత సమ్మె చేపట్టనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16 నుంచి పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు సమ్మె విషయం గురించి సదరు కార్మికులు కమిషనర్లకు తెలిపారు. ఒక్క నరసరావుపేట మున్సిపాల్టీలోనే 150 మందికి పైగా కార్మికులు నిరవధిక సమ్మె లోకి వెళ్లనున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. నరసరావు పేటలో కార్మికులు శనివారం ప్రదర్శన నిర్వహించారు.

ఇవీ కార్మికుల డిమాండ్లు..

మున్సిపాల్టీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్లు ఇవీ..

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. జీవో 36 ప్రకారం జీతాలు రూ.21,000 నుంచి రూ.24,500లకు పెంచాలి.
- ఇంజనీరింగ్ కార్మికులను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి జీతాలు చెల్లించాలి.
- గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి.
- ఉద్యోగ విరమణ ప్రయోజనాలు పెంచాలి.
- తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.
- ఆప్కాస్‌ను రద్దు చేసి పర్మినెంట్ చేయాలి.
- వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలి.

ఇసుక.. చూద్దాంలే?



● నిల్వపై మైనింగ్ శాఖ నిర్లక్ష్యం
● కొండంత అవసరం.. గోరంత నిల్వలు
● స్టాక్‌పాయింట్లలో అందుబాటులో 50 వేల టన్నులు
● ప్రభుత్వ పనులకు బ్లాక్‌లో కొనుగోలు చేస్తోన్న కాంట్రాక్టర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణానదికి వరదలు వస్తాయి.. అక్టోబరు వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఇప్పటికే అవసరమైన నిల్వలను స్టాక్ పాయింట్లలో నిల్వ చేయాలి. కానీ మైనింగ్ శాఖ నిర్లక్ష్యంతో జిల్లాలో అధికారికంగా ఇసుకకు కొరత నెలకొంది. జిల్లాలోని రీచ్‌ల్లో జూన్ 1 నుంచి తవ్వకాలు నిలిపివేశారు. అప్పటికి స్టాక్ పాయింట్లలో 2.50 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయాల్సి ఉండగా 1.03 లక్షల టన్నులతో సరిపెట్టారు. ఇప్పటికే 43 వేల టన్నులు వినియోగించగా 50 వేల టన్నుల ఇసుక మాత్రమే నిల్వ ఉంది. రీచ్‌ల్లో అక్టోబరు వరకు ఇసుక తవ్వేందుకు అనుమతి లేని పరిస్థితుల్లో అప్పటి వరకు ఈ 50 వేల టన్నులు ఎలా సరిపోతాయో అధికారులు చెప్పాలి. ఇబ్బందులు ఎదురవ్వకుండా ముందుగా నిల్వ చేయాల్సి ఉన్నా అవసరమైనపుడు చూద్దాంలే అన్న మైనింగ్ అధికారుల నిర్లక్ష్య ధోరణి.. ప్రస్తుతం నిర్మాణదారులకు ఇసుక కష్టాలు తెచ్చిపెట్టింది. చివరికి ప్రభుత్వ పనులకు కూడా ఇసుకను కాంట్రాక్టర్లు అనధికారకంగానే తెచ్చుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా పరిధిలోని కోనూరులో 93,305 టన్నులు, మల్లాదిలో 8,943 టన్నులు నిల్వ చేయగా ఇప్పటికే 43 వేల టన్నుల ఇసుక అయిపోయింది. అక్టోబరు వరకు 2.50 లక్షల టన్నుల ఇసుక అవసరమని అంచనా వేసినా ఈ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోలేదు. దీంతో స్టాక్ పాయింట్లలో నిల్వలతో పనేముందని అధికారులు భావించి ఉంటారన్న ఆరోపణలు వస్తున్నాయి.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు..

అధికారిక రీచ్‌లో తవ్వకాలపై జూన్ 1 నుంచి నిషేధాన్ని అమలు చేస్తున్నారు. అయితే అనధికారికంగా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్టాక్ పాయింట్లలో నిల్వలు లేకపోవడంతో నిర్మాణదారులు బ్లాక్ మార్కెట్‌లో ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోంది. అక్రమార్కులు కృష్ణానదిలో ఇష్టం వచ్చినట్లుగా తవ్వకాలు జరుపుతున్నా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. అధికార పార్టీ అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మైనింగ్ శాఖపై ఆధారపడితే టన్ను ఇసుక కూడా లభించే పరిస్థితి లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇసుక నిల్వలపై మైనింగ్ శాఖ జిల్లా అధికారిని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆ అధికారి స్పందించలేదు.

దాచేపల్లిలో.. భూ దోపిడీ



దాచేపల్లి మండలంలోని ప్రభుత్వ భూములు

● 22-ఏ నుంచి వందల ఎకరాలు మాయం
● ప్రైవేటు వ్యక్తులకు, సిమెంట్ పరిశ్రమలకు లబ్ధి
● ఎనిమిది నెలల్లో కుటుంబరావు అవినీతి బాగోతం

పిడుగురాళ్ల, దాచేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి తహసీల్దార్‌గా కుటుంబరావు ఎనిమిది నెలలే పని చేశారు. కానీ వందల ఎకరాల భూ దోపిడీ చేశారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ఆలోచనతో ప్రైవేటు సిమెంట్ పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేలా రెవెన్యూ రికార్డులనే మార్చేశాడు. 22-ఏ జాబితా నుంచి వందల ఎకరాలు మాయం చేశాడు. దీంతో మండలంలో కుంటలు, చెరువులకు రెక్కలు తెప్పించాడు. కేశానుపల్లి, గామాలపాడు, మాదినపాడు, పెదగార్లపాడు, భట్రుపాలెం గ్రామాల్లోని కొండలు, గుట్టలను సైతం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేశాడు. భట్రుపాలెంలో 334-4-1లో ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుకు మించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి 22-ఏ నుంచి మినహాయింపు ఇచ్చాడు. పెదగార్లపాడు గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి సిమెంట్ పరిశ్రమకు చెందేలా చేశాడు. ప్రైవేటు వ్యక్తుల తో పాటు సిమెంట్ పరిశ్రమల ప్రతినిధుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. జిల్లాలో ఏ తహసీల్దార్ చేయని సాహసం కుటుంబరావు చేసి సస్పెన్షన్‌కు గురై ఇంటిముఖం పట్టాడు. 2024 ఆగస్టు నుంచి 2025 జూన్ వరకు కుటుంబరావు తహసీల్దార్‌గా పనిచేయగా మార్చి, ఏప్రిల్ రెండు నెలల పాటు సెలవులో ఉన్నాడు. ఆ తర్వాత గురజాలకు బదిలీ అయ్యారు.

అన్నీ తానై..



సస్పెండైన కుటుంబరావు

రెవెన్యూ శాఖలో ఏదైనా ఫైలు కదలాలంటే వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ సంతకాలతో తహసీల్దార్ వద్దకు చేరుతుంది. ఆ ఫైల్‌లోని వివరాలన్నీ పరిశీలించాక అభ్యంతరాలు ఉంటే తహసీల్దారు పక్కన పెట్టాలి. అయితే దాచేపల్లి మం డలంలో తహసీల్దారుగా కటుంబరావు ఏ అధికారి సంతకం, గ్రామసభ ఆమోదం లేకుండానే అన్నీ తానై రెవెన్యూ రికార్డులో పేర్లు మార్చేశాడు. ఆయా గ్రామాలకు చెందిన కొందరు రైతుల ఫిర్యాదుతో కలెక్టర్ రహస్య విచారణతో కుటుంబరావు భూ బాగోతాలు వెలుగుచూశాయి. కుటుంబరావు అక్రమాలు బయటకు పొక్కడంతో రెవెన్యూ అధికారులే అవాక్కయ్యారు.

17న ఏఎన్‌యూ ఐసెట్

● 23న ఇంజనీరింగ్, 19 నుంచి పీజీ సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు భర్తీకి..

పెదకాకాని, జులై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంబీఏ కోర్సుల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 17న ప్రవేశ పరీక్ష (ఏఎన్‌యూ ఐసెట్) జరుగుతుందని వర్సిటీ పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో డ్యూయల్ డిగ్రీ విధానంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 23న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఎన్యూ ఐసెట్‌కు 120, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 200 మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేశారని ఆయన వివరించారు. క్యాంపస్ కళాశాలల్లోని పలు పీజీ కోర్సుల సీట్ల భర్తీకి ఈ నెల 19 నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. పూర్తి సమాచారం కోసం విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షలు వర్సిటీలోని ప్రవేశాల కార్యాలయంలో జరుగుతాయని బ్రహ్మాజీరావు పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.1.96 కోట్లు వ్యత్యాసం

● సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు

శావల్యాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.1.96 కోట్లు వ్యత్యాసం ఉన్నట్లు 18వ విడత సామాజిక తనిఖీల్లో అధికారులు గుర్తించారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావేదికలో ఉపాధి అక్రమాలు వెలుగు చూశాయి. ఈ సందర్భంగా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ మండలంలో రూ.7,94,02,695 ఖర్చు చేయగా రూ.2,00,35,415 మెటీరియల్, కాంపోనెంట్ కింద, రూ.5,93,67,280 కూలీల వేతనాలకు ఖర్చు చేశామన్నారు. ఈ మొత్తంలో రూ.1,96,76,733 వ్యత్యాసాలున్నట్లు డీఆర్పీలు గుర్తించారన్నారు. రూ.1,35,86,739 పనులపై పునః పరిశీలనకు ఆదేశించామన్నారు. రూ.13,86,540 పనులకు తగిన ఆధారాలు చూపించాలని ఉపాధి సిబ్బందికి తెలిపారు. సిబ్బంది నుంచి రూ.3,21,326 రికవరీ చేయాలని, రూ.38 వేలు జరిమానా వసూలు చేయాలన్నారు. త్వరలో ఏపీడీ ఆధ్వర్యంలో పనులు పునః పరిశీలన చేసి ఉపాధి సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా నివాసం లేనివారికి, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమంగా మస్టర్‌లు వేసి ఉపాధి సొమ్ములు కాజేశారని డీఆర్పీలు తెలిపారు. ఒకే కుటుంబానికి రెండు జాబ్ కార్డులు పెట్టి వారికి రెండుచోట్ల అక్రమంగా మస్టర్‌లు వేశారన్నారు. ఒకే పనిని ఇద్దరూ చేసినట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు చూపించారని, కొన్ని చోట్ల పనులు చేయకుండానే చేసినట్లుగా చూపించగా, కొన్ని చోట్ల కొలతల్లో పూర్తి స్థాయిలో వ్యత్యాసాలు నమోదు చేసినట్లుగా డీఆర్పీల వివరించారు. మస్టర్ షీట్లలో కూలీలు సంతకాలు పెట్టాల్సి ఉండగా వారికి బదులు అన్ని సంతకాలు ఒక్కరే పెట్టారని అధికారులకు తెలిపారు. ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ అధికారి ఇరాలాల్, ప్రోగ్రాం మేనేజర్, రాష్ట్ర పరిశీలకులు ఈశ్వర్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభాకర్, ఏపీడీ బూసిరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఎస్సార్పీ అవులయ్య తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

జమలో.. జాప్యం



చిలకలూరిపేట : బర్లీ పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ (పాత చిత్రం)

● బర్లీ రైతులకు రూ.29 కోట్లు బకాయి ● గత నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు
● ఆర్థిక శాఖ అనుమతులు పెండింగ్‌తో నిలిచిన చెల్లింపులు

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

గతంలో ఎన్నడూ లేనివిధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొంటున్నది. ఇంతవరకు బాగానే ఉన్నా ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకును కొనడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా డబ్బుల జమ విషయంలో జాప్యం జరుగుతుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో జూన్ 19 నుంచి బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రత్యేకంగా మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. ఇప్పటి వరకు 2,600 టన్నుల పొగాకును రైతుల నుంచి సేకరించింది. ఇందుకు సంబంధించి బాపట్ల జిల్లాలో 680 మంది, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 453 మంది రైతులకు మార్క్ ఫెడ్ సుమారు రూ.29 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ నగదు జమ విషయంలో రైతులకు మూడు వారాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. బర్లీ పొగాకు కొనుగోళ్ల కోసంగా ప్రభుత్వం రూ.273.17 కోట్లను కేటాయించగా తక్షణమే రూ.100 కోట్లు విడుదలకు మంత్రివర్గం జూన్ 25న పచ్చ జెండా ఊపింది. ఈ ప్రకటన తర్వాత తమ ఖాతాల్లో డబ్బులు వెంటనే పడతాయని పొగాకు రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆర్థిక శాఖ నుంచి అనుమతులకు క్లియరెన్స్ లభించకపోవడంతో రైతుల ఖాతాల్లో నగదు జమలో జాప్యం జరుగుతుందని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతాయని చెబుతున్నా రైతుల్లో మాత్రం గందరగోళం నెలకొంది

అదనంగా మరికొన్ని కేంద్రాలు..

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బర్లీ పొగాకును జూన్ 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనడం ప్రారంభించింది. ఈ క్రాప్ చిక్కులతో పాటు ఫోన్ మెసేజ్‌లపై రైతులకు అవగాహన లేకపోవడంతో ఆరంభంలో ఓ వారం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. సాంకేతిక చిక్కులు కొలిక్కి రావడంతో పాటు రైతులకు నిర్దేశించిన సమయంలోనే ఫోన్ మెసేజ్ ఆధారంగా పొగాకును కేంద్రాలకు తీసుకు వస్తుండడంతో కొనుగోళ్లు గాడిన పడ్డాయి. ఇప్పటి వరకు 2,600 టన్నులను మార్క్‌ఫెడ్ సేకరించింది. అయితే కొనుగోళ్ల కేంద్రాల వద్ద రద్దీ పెరగడంతో అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు రైతుల నుంచి పెద్దఎత్తున వస్తున్నాయి. ఈ విషయాన్ని బర్లీ రైతులు ఇటీవల పంగలూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనంగా మరికొన్ని కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ సోమవారం ప్రారంభించనున్నది.

రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాలు

ఈ సీజన్‌లో కంపెనీలు దాదాపు 2600 టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. నాలుగు జిల్లాల పరిధిలో రైతుల వద్ద ఇంకా దాదాపు 35,000 టన్నుల పొగాకు నిల్వ ఉన్నట్లు యంత్రాంగం చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేలో తేలింది. నగటున రోజుకు 600 టన్నుల పొగాకు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినా ఇంకా రెండు నెలల పాటు మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్ధన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..



ప్రవీణ పరుచూరి

'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకన్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ'. రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

'సెమిస్టర్'కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జులై 12(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

ఉపాధి కోసం వెళ్లారు...
ఉగ్ర మూకల బారిన పడ్డారు

- ఇన్‌స్టా ఉద్యోగ ప్రకటనతో మోసపోయిన ఇంజనీరింగ్ నిరుద్యోగులు
- థాయ్‌ల్యాండ్ వచ్చిన వారిని మయన్మార్‌కు తరలింపు
- డ్రగ్స్ తీసుకోవాలంటూ చిత్రహింసలు
- రక్షించాలని తల్లిదండ్రులకు ఫోన్
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను కలిసిన తల్లిదండ్రులు

విజయనగరం, జులై 12(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత ఉగ్ర, డ్రగ్స్ ముఠాల చేతుల్లో చిక్కుకోవడంతో స్థానికంగా వారి తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు. తమ పిల్లలను రక్షించి, సురక్షితంగా స్వస్థలాలకు రప్పించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మే నెలలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ కావడంతో విశాఖపట్నం నుంచి ముగ్గురు, విజయనగరం నుంచి ఇద్దరు, కడప జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్ నుంచి ముగ్గురు... మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన థాయ్‌ల్యాండ్ ప్రతినిధులతో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత... ప్రకటనదారులు చెప్పిన తీయని, ఆకర్షణీయమైన కబుర్లను నమ్మారు. వారు సూచించినట్లుగా వారివారి ప్రాంతాల నుంచి బయలుదేరి మే 9న థాయ్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. థాయ్‌ల్యాండ్‌లో మొదటి రోజు చక్కగా చూసుకున్న ప్రకటనదారులు... ఆ మరుసటి రోజునే ఉద్యోగం కోసం వచ్చిన వారికి ముసుగులు వేసి మయన్మార్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు... ఉద్యోగార్థులందరినీ మయన్మార్‌లో ఒక నది ఒడ్డున ఉన్న క్యాంప్‌లో ఉంచారు. చిత్రహింసలు పెట్టారు. డ్రగ్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేశారు. నిరాకరించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెళ్లిన 12 మందిలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు... వారి చెర నుంచి తప్పించుకొని స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు ఫోన్‌లో తమ పరిస్థితిని బాధితులు వివరించారు. తామున్న ప్రాంతం లొకేషన్‌ను షేర్ చేశారు. తమను రక్షించాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలను బాధితుల కుటుంబ సభ్యులు కలిశారు. స్పందించిన పవన్ కల్యాణ్, లోకేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడారు. ఆ ఉగ్రమూకల చెరలో మనదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. తాము చేసుకున్న విన్నపాలపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేకపోవడంతో బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాలతో తమ పిల్లలను ఇళ్లకు చేర్చాలని వారు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు

- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి నారాయణ

అమరావతి, జులై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు నగరాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి. 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్' విభాగంలో 10 లక్షల జనాభాపైబడిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షలకు మధ్య ఉన్న నగరాల్లో గుంటూరు, 50 వేలు - 3 లక్షల మధ్య ఉన్న నగరాల్లో తిరుపతి అవార్డులు గెలుచుకున్నాయి. 'మినిస్టీరియల్ అవార్డ్ ప్రత్యేక కేటగిరి'లో జీవీఎంసీ విశాఖపట్టణం, మినిస్టీరియల్ అవార్డు రాష్ట్ర స్థాయి కేటగిరిలో రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. ఈనెల 17న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొంగూరు నారాయణ ఈ అవార్డులను అందుకోనున్నారు. అవార్డుల రాకపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమ ఫలితంగానే జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని ఐదు నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించాయని అన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ అవార్డులు సాధించడంలో విజయవాడ, గుంటూరు. తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగర ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అవార్డులు రావడానికి శ్రమించిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి పట్టాభి అభినందనలు తెలిపారు.

దారుణమైన దొంగల ముఠా పార్టీ వైసీపీ

● ఎమ్మెల్యే యరపతినేని



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీ దారుణమైన దొంగల ముఠా అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఘాటు విమర్శ చేశారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పొందుగులలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు యరపతినేని వివరించారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఉన్న విద్యార్థులందరికీ ఇవ్వడంతో మధ్య తరగతి కుటుంబాలకు భరోసా కల్పించినట్లయిందని పేర్కొన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. కిసాన్ మేళాను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మేళాకు ఉద్యాన, వ్యవసాయ, మత్స్య, అటవీ శాఖాధికారులతోపాటు శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పత్తి, మిర్చి, కంది, వరి తదితర పంటల యాజమాన్య పద్ధతులను వివరించి, రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు హాజరు కానున్నారని తెలిపారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్

● ఉమ్మడి జిల్లాలో మూడు సహాయక కేంద్రాలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న అధ్యాపకులు

గుంటూరు (విద్య) జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తేదీ వరకు ర్యాంకుల వారీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అదేవిధంగా సర్టిఫికెట్ల పరిశీలన కూడా ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగిస్తారు. రిజిస్ట్రేషన్, సర్టిఫి కెట్ల పరిశీలన పూర్తిచేసుకుని ఫీజు చెల్లించిన విద్యార్థులు వెబ్ కౌన్సె లింగ్‌లో పాల్గొంటారు.

వెబ్ కౌన్సెలింగ్‌లో ఈ జాగ్రత్తలు పాటించండి

ఇంజనీరింగ్ ప్రవేశాల్లో కీలక దశ వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు సూచిస్తున్నారు.

- కౌన్సెలింగ్‌కు ముందు కళాశాలల జాబితా సిద్ధం చేసుకోవాలి. ఆయా కళాశాలల గత నాలుగైదు సంవత్సరాల ఫలితాలు, ప్రాంగణ ఎంపికలు, అధ్యాపకుల వివరాలు, ఎన్‌బీఏ గుర్తింపు, అటానమస్ స్టేటస్ తదితర అంశాలను పరిశీలించుకోవాలి.
- కొన్ని కళాశాలల్లో పైకి పెద్ద భవనాలు కనిపిస్తున్నా.. లోపల బోధన అస్తవ్యస్తంగా ఉంటుంది. విద్యార్థులకు అపరిమిత స్వేచ్ఛ ఇవ్వడంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే గాడి తప్పే అవకాశం పొంచి ఉంది.
- సొంత బస్సులు ఉన్న కళాశాలలను ఎంచుకుంటే రవాణాలో భద్రత ఉంటుంది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లేందుకు కనీసం 45 నిమిషాలు లేదా గంట సమయం పడితే సరే.. అంతకుమించి ఎక్కువ సమయం పడితే అటువంటి కళాశాలను ఎంచుకోకపోవడమే ఉత్తమం.
- వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఎంచుకునే సమయంలో ముందుగా కళాశాల పేరు, అందులో ఉన్న బ్రాంచీలు పేపర్ పై నోట్ చేసుకొని తర్వాత కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ కళాశాలలో ఎక్కువ బ్రాంచ్‌లు ఆప్షన్స్‌లో నమోదు చేసుకోవాలని అధ్యాపకులు సూచిస్తున్నారు.
- వెబ్ ఆప్షన్స్ సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మొబైల్ ఫోన్ నంబర్లకు ఓటీపీ వస్తుంది. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు. ఓటీపీ ఇతరులకు తెలిస్తే కళాశాలలో వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ వారి చేతుల్లోకి వెళ్లిపోయే అవకాశం ఉంది.
- గుంటూరు నగరానికి సమీపంలోని ఎంటీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా సాంకేతిక విద్యాశాఖ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసింది. వెబ్ కౌన్సెలింగ్‌లో సందేహాలు, సీట్లు ఎంచుకోవడంలో ఉన్న అనుమానాలను ఇక్కడ నివృత్తి చేస్తారు. ఇక్కడి నుంచే వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

బతుకు భారమై అమ్మ ఆత్మహత్య

- కన్నబిడ్డలపైనా.. పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం
- పరుగులు తీయడంతో తప్పించుకున్న చిన్నారులు
- అప్పుల భారంతో భర్త బలవన్మరణం
- సంవత్సరీకం రోజే విషాదం



సుబ్బమ్మ కుమారుడు అఖిల్‌రెడ్డి, కుమార్తె లక్ష్మీకార్తిక

మాచర్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కష్ట సుఖాల్లో తోడుంటానని తాళి కట్టి ప్రమాణం చేసిన భర్త అప్పుల భారంతో బలవన్మరణం చెందాడు. అనంతరం బతుకు భారమై.. భార్య కూడా భర్త వద్దకే వెళ్లాలనుకుంది. భర్త సంవత్సరికం రోజునే ఇద్దరు పిల్లలనూ తనతో తీసుకెళ్లాలన్న నిరాద్దాక్షిణ్య నిర్ణయానికి వచ్చింది. అటవీ ప్రాంతానికి కొడుకు, కూతురిని తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై, వారిపై పోసి నిప్పంటించుకునే ప్రయత్నం చేసింది. అయితే చిన్నారులిద్దరూ భయంతో పరుగులు పెట్టడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కానీ, అమ్మ మాత్రం అగ్నికి ఆహుతైంది. దీంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలైన విషాదకర ఘటన మాచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. వివరాల మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల సుబ్బమ్మ(32)కు అదే గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న కొంత పొలంతోపాటు మరికొంత కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశారు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి లేక సుమారు రూ. 10 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక.. బ్రహ్మారెడ్డి మనస్తాపంతో గతేడాది ఇదే రోజున పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మరణంతో సుబ్బమ్మ మానసికంగా కుంగిపోయింది. బతుకు భారమైంది. కడుపున పుట్టిన చిన్నారులను పోషించడం కష్టతరంగా మారింది. భర్త మరణించిన రోజునే తాను కూడా మరణించాలని శనివారం కుమారుడు పన్నెండేళ్ల అఖిల్‌రెడ్డి, పదకొండేళ్ల కుమార్తె లక్ష్మీకార్తికతో కలిసి అనుపునకు చేరుకున్నారు. అక్కడ అటవీ ప్రాంతంలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను సుబ్బమ్మ తనపై పోసుకొని.. పిల్లలపై కూడా పోసింది. అయితే.. పిల్లలు భయంతో పోరిపోతూ అక్కడ సెక్యూరిటీ గార్డు కంటపడ్డారు. అతను విచారించగా.. పిల్లలు జరిగిందంతా చెప్పారు. దీంతో సెక్యూరిటీ గార్డు, పిల్లలు కలిసి సుబ్బమ్మ వద్దకు వెళ్లగా ఆమె అప్పటికే నిప్పంటించుకొని కాలిపోయింది. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.700.. 42 రకాల వైద్య పరీక్షలు

◆ 20 నిమిషాల్లో ఫోన్‌కు రిపోర్టు ◆ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ఆధునిక యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో తక్కువ వ్యయంతో వేగంగా ఆరోగ్య వివరాలు తెలిపే ఆధునిక యంత్రాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యంత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. దండమూడి హెల్త్ ఆఫీస్ సర్వీస్ (డీహెచ్‌ఓ ఎస్) అరవింద కుమార్ తోడ్పాటుతో ఈ యంత్రాన్ని అమర్చారు. కేవలం సేవా దృక్పథంతో అక్కడ అయ్యే ఖర్చులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని కేవలం రూ.700కు 42 రకాల వైద్య పరీక్షలను ఈ మెషిన్ ద్వారా చేస్తారు. కేవలం 20 నిమిషాలలో రిపోర్టును సంబంధిత వ్యక్తుల సెల్ ఫోన్‌కు పంపుతారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుల్లారావు అరవింద్ కుమార్‌ను అభినందించారు. చిలకలూరిపేట ప్రాంత ప్రజలకు ముఖ్యంగా పేదలకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలు-2025కు రచయితల నుంచి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ కథా సంపుటాలను నాలుగు ప్రతులు చొప్పున.. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202 శ్రీ వెంకట సాయి రెసిడెన్సి, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామాకు ఆగస్టు 9వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు. నవంబరు 7న గుంటూరులో జరిగే ప్రొఫెసర్ రంగా జన్మదినం సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98494 97739, 93930 15584, 98483 51517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సజావుగా ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు

తనిఖీ చేసిన కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పెదకాకాని, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సీడీఈ) ఆధ్వర్యంలో జరుగుతున్న యూజీ, పీజీ, డిప్లమా పరీక్షల కేంద్రాలను దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయల పాటి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. తాడికొండలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా డిగ్రీ కాలేజ్, ప్రభల లక్ష్మీ నారాయణ మెమోరియల్ కళాశాల ల్లోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న దూర విద్య పరీక్షలను సజావుగా నిర్వహించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

చర్లపల్లి, ధర్మవరానికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా చర్లపల్లి, ధర్మవరానికి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయించింది. 07003 చర్లపల్లి-ధర్మవరం రైలు ఈ నెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి 10.48కి నడికుడి, 11.48కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.45కి గుంటూరు, 1.45కి తెనాలి, 2.33కి బాపట్ల, మరుసటి రోజు ఉదయం 9.20కి తిరుపతి, మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరం చేరుకొంటుంది. 07004 ధర్మవరం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 4.30కి బయలుదేరి రాత్రి 8.55కి తిరుపతి, మరుసటి రోజు వేకువజామున 4.26కి గుంటూరు, 5.43కి సత్తెనపల్లి, ఉదయం 6.13కి నడికుడి, 11 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది.

వైసీపీ కార్యకర్త గోపీ అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

మాచర్లటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త మల్లెల గోపీ అలియాస్ డీజేను పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మాచర్ల పట్టణంలో 2022 డిసెంబరు 16 టీడీపీ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేసిన కేసులో గోపీ నిందితుడు. టీడీపీ పార్టీ ఆఫీసు తగలబెట్టిన సమయంలో కారు డ్రైవర్ బత్తుల వెంకటేశ్వర్లుపై రాడ్డుతో దాడి చేశాడు. లోపల కార్యకర్తలు ఉన్నారని తెలిసి కూడా కార్యాలయంపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో నిందితుడు. దుర్గి మండలంలో ఓ హోంగార్డుపై దాడి, మాచర్ల పట్టణంలో బొండా ఉమ, బుద్దా వెంకన్నపై దాడి ఘటన, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌తో కలిసి తెలంగాణలో కిడ్నాప్‌కు పాల్పడిన ఘటన ఇలా పలు కేసుల్లో అతను నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసుల్లో మాచర్ల పట్టణ పోలీసులు శనివారం గోపీని అరెస్ట్ చేసి.. మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని పోలీసులు గురజాల సబ్ జైలుకు తరలించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 548.60 అడుగులు ఉంది. ఇది 206.70 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ 1650 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 62,400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	205.00



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి

అధైర్యపడొద్దు.. నేనున్నాను

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు.. నేనున్నాను.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తిలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి వస్తున్న అర్జీలను పరిశీలించారు. సంబంధిత శాఖాధికారులకు అందించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వంగులూరి పుల్లయ్య, అక్కిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నివేశన స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి..

సత్తెనపల్లి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మండలంలో అర్హులైన పేదలు ఇంటి నివేశన స్థలం కోసం సమీపంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చక్రవర్తి శనివారం తెలిపారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు ఫోటోతోపాటు అర్జీ దాఖలు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం లేని పేదలందరూ అందుబాటులో ఉన్న సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దుర్గేశ్వరరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అందరికీ గృహాలు కార్యక్రమంలో భాగంగా ఇల్లు, ఇంటి స్థలం లేని పేదలకు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, ఇంటి స్థల పట్టాలను పంపిణీ చేస్తుందన్నారు.

నరసయ్యకు ఘన సత్కారం



నరసయ్యను శాలువాతో సత్కరిస్తున్న శంకరరావు, హనుమంతురావు, వెంకటేశ్వర్లు

రాజుపాలెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు అనాథ పిల్లల, వృద్ధాశ్రమంలో అనుపాలెం సొసైటీ నూతన అధ్యక్షుడు తోట నరసయ్యను శనివారం ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతురావు, గరికపాటి శంకరరావు, జనసేన నాయకులు రుసుం వేంకటేశ్వర్లు, పసుపులేటి వేంకటేశ్వర్లు, బాబురావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

సత్తెనపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరివర్తన ఆశ్రమానికి ఖమ్మం జిల్లా లక్ష్మీపురానికి చెందిన షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ శనివారం మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందించింది. సీలింగ్ ఫ్యానులు బ్యాగులు, టిఫిన్ బాక్సులు, టేబుల్ ఫ్యాన్, మిక్సీ, గ్రీజర్, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు నారాయణ, యర్రం రాఘవరెడ్డి, రవీంద్ర రాజేష్, వీరాంజనేయ రెడ్డి, కిషోర్‌బాబు, మేరి, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ లాయర్స్ ఫెడరేషన్స్ అధికార ప్రతినిధిగా సంగీతరావు

సత్తెనపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధిగా సత్తెనపల్లికి చెందిన బొక్కా సంగీతరావును నియమిస్తూ ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఫుసులూరి జీవ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంగీతరావు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ను అభివృద్ధి చేయటంతో పాటు మాదిగలకు న్యాయపరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

భూమి శిస్తు చెల్లించి రసీదు పొందండి..

మాచవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు భూమి శిస్తు చెల్లించి రసీదులు పొందాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు శనివారం తెలిపారు. మండలంలోని తొమ్మిది గ్రామాల పరిధిలో సుమారు రూ 60 లక్షల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల వీఆర్‌వోలు భూమి శిస్తు వసూలు చేసేందుకు వస్తారని, రైతులు సహకరించి శిస్తు చెల్లించి రసీదులు పొందాలని కోరారు.

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సహాయం

అచ్చంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో శనివారం స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న షేక్ నాగూర్ బాజీకి సంఘ సేవకురాలు మామిళ్ళపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా రూ.28వేల చెక్కును అందజేశారు. ఉండవల్లి గ్రామానికి చెందిన బాజీ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ ఫీజు నిమిత్తం ఇది అందించారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో శనివారం 15.02 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,694 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 4,600 క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా, 400 క్యూసెక్కులు లీకుల ద్వారా, మొత్తం 5వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 0.77 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, జూలై 12(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.77 ఎంయుల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యంలు చెప్పారు. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 11,320 క్యూసెక్కులు, టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8757 మొత్తం 20,077 క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 7.080 టీఎంసీల నీరుండగా ఈ నీరు 247.70 అడుగులకు సమానమన్నారు.



టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఇంటింటికి కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు మండలంలోని పాడిబండ్ల గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని, త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాన్ని అందజేస్తుందన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు పఠాన్ నూర్జహాన్, మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మండల నాయకులు ఆర్తిమల్ల రమేష్, భాష్యం ఆంజనేయులు, పరస తాళ్లూరు, నరుకుళ్లపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్లు ఏటుకూరి రత్నకుమార్, భాష్యం జగదీష్, మాజీ ఎంపీపీలు పాటిబండ్ల శివమ్మ, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబురావు, డీసీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ మండల నేతలు పరుచూరి పూర్ణచంద్రరావు, షేక్ ముంతాజ్, మద్దినేని వెంకట సత్యనారాయణ, మోదుగుల చంద్రశేఖర్, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, ఏటుకూరి గంగాధర్, పాటిబండ్ల యోహాన్, గంగినేని లీలావతి, షేక్ మస్తాన్ షరీఫ్, చంద్ర పూర్ణచంద్రరావు, నూతక్కి ఈశ్వరి, సయ్యద్ సుభాని, ఏరువ బాలిరెడ్డి, షేక్ మాబు, రమేష్, వేమవరపు వెంకటేశ్వరరావు, పాటిబండ్ల ఆర్లయ్యతహసిల్దార్ నీలి ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను టీడీపీ మండల అధ్యక్షుడడు ఏటుకూరి బ్రహ్మయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రవీణ్ ఎగురవేశారు. మహిళలు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు ఘన స్వాగతం పలికారు.

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు



కారంపూడి: రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు

కారంపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, వ్యవసాయశాఖ అధికారుల సలహాలను పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు అన్నారు. శనివారం ఏవో పోట్ల నరసింహారావుతో కలిసి మండలంలోని పత్తి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. యాంత్రీకరణ పద్ధతులను అనుసరిస్తూ పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చాన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే కొని, వాటికి రసీదులు పొంది భద్రపరుచుకోవాలని చెప్పారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మొక్కజొన్న సాగుచేసే రైతులు వ్యవసాయశాఖతో అనుసంధానం చేసుకుంటూ పంట వేసుకోవాలన్నారు. ప్రతి ఎకరానికి రైతులు పంట నమోదు చేయించుకోవాలని, పంటల భీమాను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, చప్పిడి రాము, ఉప ఎంపీపీ పూర్ణచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

దుర్గి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పత్తి పంటను ఆశిస్తున్న పచ్చదోమ నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం జగ్గారావు అన్నారు. శనివారం అడిగొప్పులలో పత్తిపంటను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పచ్చదోమ నివారణకు ఆసిటమీప్రిడ్ 1 లీటరు నీటికి ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు పత్తి పంటకు వాతావరణ ఆధారిత పంటల భీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవో అమీర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి సాంబశివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సుపరిపాలనలో తొలిఅడుగు

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు దుర్గారావు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న దుర్గారావు

మాచర్లటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, తమ్మిశెట్టి ఏడుకొండలు, దేరంగుల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి

టీడీపీ సీనియర్ నేత యాగంటి



దుర్గి: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న యాగంటి

దుర్గి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని అడిగొప్పులలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల దాసు, జానకిరామయ్య, యాగంటి నరేష్, పి.నారయ్య, నూరె వెంకటేశ్వర్లు, ఏ చెన్నయ్య, ఎం.రామారావు, పి.బుజ్జి, కె.ఆంధ్రయ్య, టి.కొండలు, బి.కోటేశ్వరరావు, డి.ప్రసాదరావు, జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రెడ్డిగూడెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రాజుపాలెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డిగూడెం, అంచులవారిపాలెం, రాజుపాలెం, ఉప్పలపాడు, బలిజేపల్లి, నెమలిపురి తదితర గ్రామాలలో సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహరావు, పల్లపాటి పెద్దిరాజు, నాయకులు పులిబండ్ల సాంబశివరావు, వాసా వెంకటేశ్వర్లు, జెట్టి కోటేశ్వరరావు, షేక్ అల్లాబక్షు, దుద్దు అప్పారావు, షేక్ బాబావలి, షేక్ ఇమ్రాన్, సీతయ్య, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ విజయ కుమార్

సత్తెనపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో శనివారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ ఆల్కహాల్, డ్రగ్స్ సేవించటం ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల మానవ శరీరంలోని వ్యవస్థలు దెబ్బతింటాయన్నారు. ఏకాగ్రత లోపించటం, నిద్ర లేమి, మతిమరపు వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. గంజాయి, డ్రగ్స్ సంబంధిత నేరాల్లో 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ఈ మేరకు వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నాగలక్ష్మి, సిబ్బంది కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

అనసూయమ్మకు ఎమ్మెల్యే యరపతినేని ఘన నివాళి



అనసూయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ మాతృమూర్తి అనసూయమ్మ గత నెల 27వ తేదీన మృతిచెందారు. శనివారం గురజాలలోని నివాసయంలో వైకుంఠ సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ కుడి కాలువ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, కూటమి నేతలు కటికం అంకారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, శరమాల హనుమంతురావు, బడిదెల శ్రీనివాసరావు, ఉప్పుడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్నాడు జిల్లా అండర్-13 చెస్ పోటీలు

మాచర్ల రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆదివారం పల్నాడు జిల్లా అండర్-13 చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శనివారం తెలిపారు. 2012 తరువాత జన్మించిన వారు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చన్నారు. మొదటి రెండు స్థానాల్లో ఇరువురు బాలురు, ఇరువురు బాలికలను ఆగస్టు 2, 3 తేదీల్లో మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ - 13 ఓపెన్ చెస్ పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-9, అండర్-11 విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ బహూకరించనున్నట్లు చెప్పారు.

అన్న ప్రసాదం పంపిణీ

కారంపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల శ్రీపసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో 300మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. పయ్యావుల పేరమ్మ కుటుంబసభ్యులు, ఒప్పిచర్లకు చెందిన ఇల్లూరి పుల్లయ్య, ఆదిలక్ష్మి దంపతులు, పెదకొదమగుండ్లకు చెందిన గుండా కోటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, కోటా పాపారావు, విజయలక్ష్మి దంపతులు సహకారం అందించారు. కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ వ్యవస్థాపకుడు భవిరిశెట్టి రామారావు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గోవిందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వివేకానంద సేవాశ్రమంలో మహిళా యోగా టీం ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో సేవాశ్రమంలోని వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

80శాతం హామీలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలన ద్వారా ఇంటింటింకీ సంక్షేమం అందిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కుందురువారిపాలెంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చినహామీలను 80 శాతం పూర్తి చేశామన్నారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కూటమి నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. సమమస్యలు తెలుసుకుని మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ప్రజలనుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి రైతుకు అందిస్తామన్నారు. అగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో మరింత నిధులు తెచ్చి సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కన్నా అన్నారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్

బెల్లంకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పెదకూరపాడు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్ పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ మండలం న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. గడపగడపకు వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, శ్రీధర్ నాయక్, ఎంపీటీసీ నరసింహా నాయక్, లాల్ సాహెబ్, బల్ల వెంకటేశ్వర్లు, రామ్‌జీనాయక్, రామారావు నాయక్, మువ్వా కొండ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

సీపీఐ మహాసభను విజయవంతం చేయండి

బెల్లంకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజక వర్గంలో ఈనెల 20వ తేదీన 16వ సీపీఐ మహాసభను విజయవంతం చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో మహాసభను ఏర్పాటుచేస్తున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గ సీపీఐ కార్యకర్తలు, నాయకులు, ప్రజాసంఘాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు పోతుగంటి నాగేశ్వరరావు, వెంకటరావు, మండల కార్యదర్శి బీ వెంకటరావు, శ్రీనివాసరావు, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



కంపచెట్లతో నిండిన దశబంధు కాల్వ..

'దశబంధు'.. నాడు-నేడు!

రెంటచింతల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో సాగునీటి కాల్వలకు మహర్దశ పట్టింది. నియోజకవర్గంలోని కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించగా.. అందులో రూ.1.33 కోట్లు రెంటచింతల మండలానికే కేటాయించడం విశేషం. ముఖ్యంగా దశబంధు కాల్వలో రూ.33 లక్షలతో కంప చెట్లు తొలగించి, మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో 4,384 ఎకరాలకు సాగు నీరు సాఫీగా అందనుంది. ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు తెలిపారు.



మరమ్మతుల అనంతరం ఇలా..

నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

యడ్లపాడు, రొంపిచర్ల, ఈపూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ఇళ్లు లేని పేదలందరూ నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్‌లు విజయశ్రీ, బండి నిర్మల, నళిని కోరారు. శనివారం వారు మాట్లాడుతూ అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ నివేశన స్థలాలు మంజూరు చేయనుందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు రేషన్ కార్డు, కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను జతచేయాలని వారు స్పష్టం చేశారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారం



బహుమతి ప్రదానం చేస్తున్న సినీనటుడు వెంకట కృష్ణారావు

రొంపిచర్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. 10వ తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన సాధుసాధు సాహితికి రూ.15వేలు, రెండో స్థానంలో నిలిచిన ఘంటా ప్రేమలక్ష్మి మురారీకి రూ.12వేలు, మూడో స్థానంలో నిలిచిన మూకిటి కీర్తనకు రూ.5వేలు అందజేశారు. అదేవిధంగా 6వ నుంచి 9వ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సినీ నటుడు బొల్లా వెంకట కృష్ణారావు, డాక్టర్ క్రోసూరు నాగేశ్వరరావు, గార్లపాటి వెంకటేశ్వర్లు, హెచ్ఎం కే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలారామ్‌కు ఎన్‌టీఆర్ పురస్కారం

వినుకొండటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సాహితీ రంగంలో చేసిన సేవలకు గాను జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్‌కు శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో తెలుగువెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఎన్‌టీ రామారావు పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన కమలారామ్‌ను పట్టణంలోని పలువురు విద్యావంతులు, బంధువులు అభినందించారు.

మద్యం విక్రేత అరెస్టు

వినుకొండటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న మందటి శ్రీనివాసరావును ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. అతని నుంచి 12 క్వార్టర్ల డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేపడుతున్న ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు

వినుకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన అనాథ శవానికి ఆదర్శ ఫౌండేషన్ అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన ఘటన శనివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతున్న అనాథ శవానికి అంత్యక్రియలు చేయడం అశ్వమేధ యాగం చేసిన టువంటి పుణ్యం దక్కుతుందనే ఉద్దేశంతో అంత్యక్రియలు చేపడతామని తెలిపారు. కొన్నేళ్లుగా పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పువ్వాడ కృష్ణ, నాగూర్, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర

రొంపిచర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగార్లపాడులో జగన్నాథ స్వామి రథయాత్ర శనివారం వైభవంగా జరిగింది. నరసరావుపేటకు చెందిన ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సీతారామస్వామి దేవస్థానం నుంచి పాదయాత్ర బయలుదేరి శ్రీ వేంకటేశ్వర స్వామి, వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయాల మీదగా కొనసాగింది. భక్తులు మీరుతో వారు పోసి, స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట రేపు నిరసన

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు కోటపై ప్రభుత్వం తక్షణం నిరుద్యోగులకు భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని శనివారం తెలిపారు. అధిక సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యడ్లపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామంలో జరిగిన ఓ వేడుకలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం చర్చి పండగ జరిగింది. ఈ సందర్భంగా అదేరోజు సాయత్రం కాలనీకి చెందిన యువకులతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోలాటం తిలకించేందుకు వచ్చిన వ్యక్తికి ప్రదర్శన చేస్తున్న ఓ యువకుని చేతిలోని స్టిక్ తగిలి గాయమైంది. దీనితో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామస్థులు, పోలీసులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘర్షణ అనంతరం ఎస్ఐ శివరామకృష్ణ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఏళ్ల తరబడి సమస్యకు నిర్మాణంతో పరిష్కారం

● ఏడాది పాలనలో ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం ● రూ.17లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కాలువ కట్టపై బ్రిడ్జి



నాడు శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి



నేడు ప్రారంభానికి సిద్ధమైన బ్రిడ్జి

వినుకొండటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణానికి ప్రామాణికంగా నిలిచిన కొత్తపేట వంతెన బజారులోని వంతెన ప్రమాదకరంగా మారడంతో గతంలో పలుమార్లు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాల మేరకు ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు స్పందించి సుమారు రూ.17లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావడంతో ఇటు కొత్తపేట, అటు సిద్ధార్థనగర్ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో ప్రమాదకరంగా మారిన ఎన్ఎస్‌పీ కాలువపై వంతెన కథనం మేరకు పలుమార్లు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోక పోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన ఏడాది వ్యవధిలోనే కొత్తపేట, సిద్ధార్థనగర్ కాలనీవాసులతో పాటు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాత్రి వేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సూచన మేరకు మున్సిపల్ కమిషనర్ బ్రిడ్జినిర్మాణ పనులను ఎట్టకేలకు పూర్తి చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీన జీవీ ఆంజనేయులు జన్మదినం పండుగ సందర్భంగా బ్రిడ్జి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేశారు.

పనిచేసేవారిని ఆశీర్వదించండి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● మూడు గ్రామాల్లో ఇంటింటికి టీడీపీ
● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



లింగారావుపాలెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గతంలో మంచి చేసే వారిని కాదని నట్టేట ముంచే వారిని నాయకులుగా ఎన్నుకోవడం వల్ల ప్రజలు ఎన్నో నష్టాలను చవిచూశారని, అలాంటి తప్పులు పునరావృతం కాకుండా, అభివృద్ధికి కట్టుబడిన కూటమిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. ఇంటింటికి తెలుగుదేశం.. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మండలంలోని లింగారావుపాలెం, కోట, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో పర్యటించారు. తొలుత లింగారావుపాలెంలో దాతల సహకారంతో నిర్మించిన మంచినీటి ప్లాంటును ప్రారంభించిన ప్రత్తిపాటి రూ.13లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కోట గ్రామంలో రూ.8లక్షలతో చెంఘీజ్‌ఖాన్‌పేటలో రూ.23లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుకు కూటమి కట్టుబడి ఉందని, త్వరలోనే పేదలకు నివేశన స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపడుతుందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ముఖ్యమంత్రి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారని, ఆయన కృషి, పట్టుదలను ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీమంత్రిపై ప్రత్తిపాటి విమర్శలు..

రాష్ట్రాభివృద్ధి ప్రజల సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలు ఆలోచించాలని ప్రత్తిపాటి సూచించారు. నియోజకవర్గంలో ముఖ్యంగా యడ్లపాడు మండలంలో ఒక్క రోడ్డు కూడా వేయని గొప్ప చరిత్ర మాజీ అవినీతి మంత్రిదని విమర్శించారు. రోడ్ల నిర్మాణంలో అలసత్వం సహించేది లేదని అన్నారు. 2014-19 మధ్య నియోజకవర్గ అభివృద్ధికి రూ.4,200 కోట్లు ఖర్చుచేశారని, కానీ ప్రజలు పనిచేసే వారిని కాదని దోచుకునే వారిని నమ్మి నష్టపోయారన్నారు. అమరావతి, పోలవరం పూర్తిచేసి ప్రజలకు ఆ ఫలాలను అందించాలన్నది చంద్రబాబు జీవితాశయమని, అలాంటి నాయకుడికి అండగా నిలబడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

700 మందికి నేత్ర వైద్య పరీక్షలు

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా 35 ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి వేలాది మందికి వైద్యసేవలు అందించినట్టు ఎమ్మెల్యే పుల్లారావు శనివారం చెప్పారు. స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో 36వ ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శంకర కంటి ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 700 మందికి నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో శంకర ఆసుపత్రి శ్రీనివాసరావు, డాక్టర్ సుధీర్, మాజీ ఎమ్మెల్యే కందిమళ్ళ జయమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మేలైన పశుగ్రాస వంగడాలతో రైతులకు ప్రయోజనం

● జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బాలశంకర్

యడ్లపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మేలైన బహువార్షిక పశుగ్రాస వంగడాలను వేసుకోవడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బాలశంకర్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వంకాయలపాడు సచివాలయంలో శనివారం పాడిరైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా పశువులకు వేసే పశుగ్రాసంతోపాటు అధిక పోషక విలువలు కలిగిన పశుగ్రాసాన్ని వేసుకోవడం ద్వారా అధిక పాల దిగుబడులు పొందవచ్చన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బహు వార్షిక గడ్డి రకాలను సాగు చేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గి దీర్ఘకాలం పశుగ్రాసం లభిస్తుందన్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 75 శాతం రాయితీపై పశుగ్రాస వంగడాలను అందిస్తోందన్నారు. యడ్లపాడు ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ మేలుజాతి పశువులు, రకాలు, పోషణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిమ్మాపురం, సొలస వీఏఎస్‌లు డాక్టర్లు కాలేషాబేగం, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

12 దాటినా జీతాలు చెల్లించలేదు

● నరసరావుపేట పుర కార్మికులకు ఆర్థిక ఇక్కట్లు



మునిసిపల్ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికులకు 12వ తేదీ దాటినా వేతనాలు చెల్లించలేదు. నెల వారి జీతంపై జీవనం సాగించే కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇక్కట్లు పడుతున్నాయి. సుమారు 500 మంది కార్మికులకు జీతాల చెల్లింపు నిలిచిపోయింది. సాంకేతిక కారణాలతో జీతాలు చెల్లించలేదని మున్సిపల్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పటికి జీతాలు చెల్లిస్తారనే అంశంపై స్పష్టత లేదు. సాంకేతిక సమస్య పరిష్కారమయ్యే వరకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. 15 తేదీ కల్లా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామంటున్నారు. వెనువెంటనే జీతాలు చెల్లించి తమను ఆదుకోవాలని కార్మికులు అధికారులను కోరుతున్నారు.

పేద విద్యార్థి చదువుకు కుల ధ్రువీకరణ పత్రం అడ్డంకి

నరసరావుపేట రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి చదువుకు కుల ధ్రువీకరణ పత్రం అడ్డంకిగా మారిన ఘటన నరసరావుపేట మండలంలో జరిగింది. మండలంలోని ఎల్లమంద గ్రామానికి చెందిన మహేశ్వరికి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు వచ్చాయి. నూజివీడు ఐఐటీలో సీటు వచ్చింది. మహేశ్వరి బేడ బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందినది. ఆ సామాజిక వర్గానికి ఇప్పటివరకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సదరు సంస్థ వారు సీటు నిరాకరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని విద్యార్థినికి తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఘనంగా ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



ప్రత్యూష సుబ్బారావు, కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్యతో విద్యార్థులు

నరసరావుపేట టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ఫార్మసిస్టులు ఔషధ నిపుణులన్నారు. ఫార్మసీ అనేది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఫార్మసిస్టులది కీలక పాత్ర అన్నారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మా ట్లాడుతూ ఎప్పటికీ నిజాయితీ, కర్తవ్యనిష్ఠతో ముందుకు వెళ్లాలని అన్నారు. కళాశాల డైరె క్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడుతూ ఫార్మసీ వృత్తి అనేది విజ్ఞానంతో పాటు మానవతా ధర్మాన్ని కలగలినదన్నారు. ప్రిన్సిపాల్ ఎం ప్రసాదరావు మాట్లాడుతూ ఎక్కడ ఉద్యోగం చేసినా నైపుణ్యం, నిజాయితీ, సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ కోయ రామారావు, మక్కెన హరిబాబు, ఎంఏఎం ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ఎస్ రామారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 864 మందికి నేత్ర పరీక్షలు



వైద్యులతో మాట్లా డుతున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో రాజాగారి కోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆస్పత్రిలో శనివారం ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్, శంకర నేత్ర వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంతో 864 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 432మందికి ఆపరేషన్ కోసం సిపార్సు చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన క్యారదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివాని, డాక్టర్ సిమ్రాన్ శిబిరంలో వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో శంకర కంటి వైద్యశాల సిబ్బంది, టీడీపీ, కోడెల అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురికిపూడిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో పలు తరగతులకు సంబంధించి సీట్లు ఖాళీగా ఉన్నాయని వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ కె.రాజబాబు శనివారం తెలిపారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు సీట్ల కోసం దరఖాస్తులు పెట్టుకోవాలని కోరారు. 6వ తరగతిలో 10 సీట్లు, 7వ తరగతి లో 4, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులు తీసుకొని వచ్చిన వెంటనే సీట్ల కేటాయింపు జరుగుతామని తెలిపారు. ఇతర వివరాలకు 74165 16599 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పణ

రొంపిచర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్లలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు ఆర్యవైశ్యులు శనివారం ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువుకట్ట సెంటర్ నుంచి మేళతాళాల మధ్య ప్రదర్శనగా ఆలయం వద్దకు వెళ్లారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, రామబ్రహ్మానందరరావు, గొడవర్తి వెంక టేశ్వర్లు, పసుమర్తి ఆదినారాయణ, కోడూరి అంకారావు, శ్రీను, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



ఆలయం వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న ఆర్యవైశ్యులు

ద్విచక్ర వాహనం చోరీకి యత్నం

● దొంగను పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

యడ్లపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీ చేసేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయపాలెంలోని రామాలయం వీధిలో శుక్రవారం అర్థరాత్రి వీధి కుక్కల అరుపులు ఎక్కువగా ఉండడంతో స్థానికులు లేచి వీధుల్లోకి వచ్చారు. అప్పటికే వీధిలోని ఇంటి ముందు పార్కుచేసి ఉన్న ద్విచక్రవాహనం తాళం తీసేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని గమనించి కేకలు వేశారు. వెంటనే అతను పరారు కావడం గమనించి పరుగున వెళ్లి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించి అతన్ని అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇదే వీధిలో గతంలో రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

సొసైటీ ప్రతినిధులు గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సొసైటీ చైర్మన్లు,సభ్యులతో ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు గ్రామీణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో కొత్తగా నియమితులైన కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు, సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎస్ఎస్ఎన్ కళాశాల దేవాలయం

నాగసరపు సుబ్బరాయ శ్రేష్ఠి సంస్మరణ సభలో ఎమ్మెల్యే చదలవాడ



నాగసరపు సుబ్బరాయశ్రేష్ఠి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, కమిటీ సభ్యులు

నరసరావుపేట టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది పేద విద్యార్థులకు ఎస్ఎస్ఎన్ కళాశాల దేవాలయమని, తాను పూర్వ విద్యార్థి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో నాగసరపు సుబ్బరాయ శ్రేష్ఠి 68వ సంస్మరణ సభ జరిగింది. నాగసరపు సుబ్బరాయశ్రేష్ఠి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులందరూ సమాజసేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ తాత సుబ్బరాయ శ్రేష్ఠి ఎస్ఎస్ఎన్ కళాశాలను 1950లో స్థాపించి వ్యవస్థాపక సెక్రటరీ అండ్ కర స్పాండెంట్‌గా అభివృద్ధి చేశారన్నారు. నిరంతరం పట్టాభిరామస్వామి ఆలయ నిర్వహణలో వంశపారంపర్య ధర్మకర్తగా కృషి చేశారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో అన్ని కార్యక్రమాలు తాను నిర్వహిస్తున్నానన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ సుబ్బరాయ శ్రేష్ఠి జీవితం అందరికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సభ్యులు బొలిశెట్టి రామమోహనరావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయిలు పాల్గొని సుబ్బరాయశ్రేష్ఠికి నివాళి అర్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి : సీఐ

ఈపూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఈపూరులో శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారాయి, కల్తీ కల్లు, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి కేర్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన సెంటర్లో మానవహారంగా ఏర్పడి సారాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వినుకొండలో విద్యార్థులకు అవగాహన

వినుకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన కేర్ కార్యక్రమంలో భాగంగా వినుకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ అంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ సుబ్బారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రూ.20 లక్షల విలువైన విద్యుత్ తీగల చోరీ

చిలకలూరిపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుమర్రు గ్రామానికి సమీపంలో ఉన్న గుదేవారిపాలెం గ్రామం పక్కన ఉన్న జగనన్న కాలనీలో రూ.20 లక్షల విలువైన విద్యుత్ తీగల చోరీ జరిగింది. దొంగలు సుమారు 15 కిలోమీటర్ల పొడవున విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలను కట్ చేసుకుని ఎత్తుకెళ్లారు. ఇది కేవలం ఒక్క రోజులో జరిగిన చోరీ కాదని కొన్ని రోజులుగా పథకం ప్రకారం తీగలను కట్ చేసుకుని తీసుకెళ్లారని అనుమానిస్తున్నారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్లో విద్యుత్‌శాఖ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం 74వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర నాయకులు బీ కోటేశ్వరరావు పాల్గొన్నారు. యూనియన్ నాయకులు యూనియన్ జెండాను ఎగురవేశారు. నాయకులు పీ కృష్ణ, అద్దంకి వరప్రసాద్, ఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.